Telugu Bhakti Pages

www.telugubhakti.com

Printer friendly version

Join Telugu Bhakti Pages group to get updates/ to participate in Dharmic discussions and to share thrilling religious views and divine experiences.

Click http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/



# శ్రీ భద్రాచల రామదాసు కీర్తనలు

## రాగము - ధన్యాపి - ఆదితాళము

తారకమంత్రము కోరిన దొరకెను
ధన్యుడనైతిని ఓరన్నా
మీఱిన కాలుని దూతలపాలిటి
మృత్యువె యని నమ్మర యన్నా ॥ ॥తా॥

ఎన్ని జన్మముల నెంచి చూచినను
ఏకో నారాయణు డన్నా
అన్ని రూపులై యున్న పరమాత్ముని
నా మహాత్ము కథలను విన్న ॥ ॥తా॥

ఎన్నిజన్మముల జేసిన పాపము
లీ జన్మముతో విడునన్నా
అన్నిటికి కడసారి జన్మమిది
సత్యం బికబుట్టుట సున్న ॥ ॥తా॥

ధర్మము తప్పక భద్రాద్రీశుని
తనమదిలో నమ్ముచునున్న
మర్మము దెలిసిన రామదాసుని

మందిరమున కేగుచునున్న ॥ ॥తా॥

## రాగము - వరాళి - ఆదితాళము

ఇదిగో భద్రాద్రి - గౌతమి
అదిగో చూడండి ॥
ముదముతో సీతాముదిత లక్ష్మణులు
కదసి కొలువగా రఘుపతి యుండెడి ॥ ॥ఇదిగో॥

చారు స్వర్ణ ప్రాకార గోపుర
ద్వారములను సుందరమై యుండెడి ॥ ॥ఇదిగో॥

అనుపమానమై యతిసుందరమై
తనరు చక్రమున ధగధగ మెఱసెడి ॥ ॥ఇదిగో॥

కలియుగమందున గల వైకుంఠము
నలరుచునున్నది నయముగ మ్రొక్కుడి ॥ ॥ఇదిగో॥

పొన్నల పొగడల పూబొదరిండ్లను
చెన్నుమీఱగను శృంగారంబగు॥ ॥ఇదిగో॥

శ్రీకరముగ నిల రామదాసుని
బ్రాకటముగ బ్రోచు ప్రభువునివాసము ॥ ॥ఇదిగో॥

## రాగము - నాదనామక్రియ- ఏకతాళము

కోదండరామ కోదండరామ
కోదండ మాం పాహి కోదండరామ ॥
నీదండ నాకు నీ వెందు బోకు
వాదేల నీకు వలదు పరాకు ॥ ॥కోదం॥

జయ రఘువీర జగదేకశూర
భయనివార భక్తమందార ॥ ॥కోదం॥

మణిమయభూష మంజలభాష
రణవిజయఘోష రమణీయవేష ॥ ॥కోదం॥

తల్లివి నీవె తండ్రివి నీవె
దాతయు నీవె దైవము నీవె ॥ ॥కోదం॥

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

సరసిజనేత్ర సౌందర్యగాత్ర
పరమపవిత్ర భవ్యచరిత్ర ॥ ॥కోదం॥

దశరథబాల దాసానుకూల
దశముఖకాల ధరణీశపాల ॥ ॥కోదం॥

మంజులభాష మణిమయభాష
కుంజరపోష కువలయవేష ॥ ॥కోదం॥

మురళీవిలోల మునిజనపాల
తులసీవనమాల తుంబురులోల ॥ ॥కోదం॥

రావణభంగ రమణీయాపాంగ
పావనలింగ పాదాబ్జభృంగ ॥ ॥కోదం॥

లాలితహాస లక్ష్మీవిలాస
పాలితదాస భద్రాద్రివాస ॥ ॥కోదం॥

శ్రీవిజయరామ శ్రీతులసీదామ
పావననామ భద్రాద్రిధామ ॥ ॥కోదం॥

రాగము - చక్రవాకం - చాపుతాళము

తక్కువేమి మనకూ రాముం డొక్కడుండువఱకూ

ప్రక్కతోడుగా - భగవంతుడు మును
చక్రధారియై - సాకుచునుండగ ॥తక్కు॥

ముచ్చుసోమకుని - ముసు చంపిన యా
మత్స్యమూర్తి మన - పక్షమునుండగ ॥తక్కు॥

భూమి స్వర్గమును - పొందుగఁ గొలిచిన
వామనుండు మన - వాఁడై యుండగ ॥తక్కు॥

దశగ్రీవు ముసు - దండించిన యా
దశరథరాముని - దయ మనకుండగ ॥తక్కు॥

దుష్టకంసుని ద్రుంచినట్టి శ్రీ
కృష్ణుడు మనపైఁ - గృపతో నుండగ ॥తక్కు॥

నారాయణదా - సుల గాచెడి శ్రీ

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

నారాయణునెఱి - నమ్మియుండగ ॥తక్కు॥

రాగము - నాదనామక్రియ - ఆదితాళము

ఏతీరుగ నను దయజూచెదవో - ఇనవంశోత్తమ రామా
నాతరమా భవసాగర మీదను - నళినదళేక్షణ రామా ॥ఏ॥

శ్రీరఘునందన సీతారమణా శ్రితజనపోషక రామా
కారుణ్యాలయ భక్తవరద నిను - గన్నది కానుపు రామా ॥ఏ॥

క్రూర కర్మములు నేరకచేసితి - నేరములెంచకు రామా
దారిద్ర్యము పరిహారము సేవవె - దైవశిఖామణి రామా ॥ఏ॥

వాసవకమలభవామరవందిత - వారిధిబంధన రామా
భాసురవర సద్గుణములు గల్గిన - భద్రగిరీశ్వర రామా ॥ఏ॥

వాసవనుత రామదాసపోషక - వందనమయోధ్యరామా
దాసార్చిత మాకభయ మొసంగవె - దాశరథీ రఘు రామా ॥ఏ॥

రాగము - యమునాకల్యాణి - ఆదితాళము

గరుడగమన రారా నను నీ
కరుణ నేలుకోరా
పరమపురుష యే వెఱుపులేల నీ
మఱుగు జొచ్చితిని అఱమఱిసేయకు ॥గరుడ॥

పిలువగానె రమ్మీ యభయము
తలపఁగానె యిమ్మీ
కలిమి బలిమి నా కిలలో నీవని
పలవరించితిని నలువను గన్నయ ॥గరుడ॥

పాలకడలిశయనా దశరథ
బాల జలజనయనా
పాల ముంచినను నీటముంచిన నీ
పాలబడితి నిఁక జాలముసేయక ॥గరుడ॥

ఏల రావు స్వామీ నను నిపు
డేలుకోవదేమీ
యేలువాడ వని చాల నమ్మితి నిం

కేల రావు కరుణాలవాల హరి ॥గరుడ॥

ఇంత పంతమేలా భద్రగి॥
రీశ వర కృపాల
చింతలణచి శ్రీరామదాసుని
అంతరంగపతివై రక్షింపుము ॥గరుడ॥

రాగము - నాదనామక్రియ - ఆదితాళము

ఏమిరా రామా - నావల్ల నేరమేమిరా రామా
ఏమిరామ యీలాగుకష్టము - నీ మహిమో నాప్రారబ్ధమో॥

మందరధర నీ-సుందరపదముల
నింది రేశ కను-గొందుఁ జావవే ॥ఏ॥

దీన మొకయేడుగ - ఘనముగ గడిపెడీ
తనయునిమీఁదను - దయలే దయయో ॥ఏ॥

రామదాసు భ-ద్రాచల సీతా
రామదాసుడను-బ్రేమతో నేలవే ॥ఏ॥

రాగము - నటకరంజని - ఆదితాళము

ఏడ నున్నాఁడో భద్రాద్రివాసు డేడ నున్నాఁడో
నాపాలి రాముఁడేడ నున్నాడో

ఏడ నున్నాడో జాడ దెలియరాదు
నాడూ గజేంద్రునికీడు బాపిన స్వామి॥ ॥ఏడ॥

పాంచాలిసభలోన భంగమొందిననాడు
వంచన లేకయె వలువ లిచ్చిన తండ్రి॥ ॥ఏడ॥
అక్షయముగ శ్రీభద్రాచలమందున
సాక్షాత్కరించిన జగదేకవీరుడు॥ ॥ఏడ॥

రాగము - ఆనందభైరవి - ఆటతాళము

ఎటు బోతివో రామ! యెటుబోతివో

ఎటుబోతివో నిన్ను నేవేడుకనుచుంటే
కటకటా నఁడు నా కనుల జూతామంటె॥ ॥ఎటు॥

అపరాధి నని చాల యర్థించి మొఱలిడగ
నెపముగ వెనుకటి నేరముల నెంచక॥ ॥ఎటు॥

నీవు భద్రాచలనిలయుఁడ వయ్యు రామ
ప్రోవవయ్య రామ దాసు నేలెడిస్వామి॥ ॥ఎటు॥

## రాగము - గౌళపంతువరాళి - ఆదితాళము

శ్రీరామ నీనామ మేమి రుచిరా
ఓరామ నీనామ మెంతరుచిరా॥ ॥శ్రీరామ॥

కరిరాజ బ్రహ్లాద తరణిజ విభీషణుల
గాచిన నీ నామ మేమి రుచిరా॥ ॥శ్రీరామ॥

కదళీఖర్జూరాది ఫలములకన్నను
పతితపావననామ మేమి రుచిరా॥ ॥శ్రీరామ॥

దధిఘృతమధురస ఫలములకన్నను
పతితపావన నామ మేమి రుచిరా॥ ॥శ్రీరామ॥

నవరసపరమాన్న నవనీతములకంటె
అధికమౌ నీనామ మేమి రుచిరా॥ ॥శ్రీరామ॥

సారము లేని సంసారమునకు సం
తారకమగు నామమేమి రుచిరా॥ ॥శ్రీరామ॥

తుంబురునారదుల్ డంబుమీఱంగ గా
నంబుచేసెడి నామమేమి రుచిరా॥ ॥శ్రీరామ॥

అరయ భద్రాచల శ్రీరామదాసుని
నేలిన నీనామ మేమి రుచిరా॥ ॥శ్రీరామ॥

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

### రాగము - సావేరి - ఆదితాళము

దినమే సుదినము - సీతారామ
స్మరణమే పావనము

ప్రీతినైనఁ బ్రాణ - భీతినైన గలిమి
చేతనైన మి - మ్మేరీతి దలఁచిన॥ ॥దినమే॥

అర్థాపేక్షను దినము వ్యర్థము గాకుండ
సార్థకముగ మిమ్ము - ప్రార్థనచేసిన॥ ॥దినమే॥

మృదంగతాళము తం-బుల శ్రుతి గూర్చి
మృదురాగముల గీత-ములు పాడిన విన్న॥ ॥దినమే॥

వాసిగ శ్రీహరి-దాసుల గూడుక
వేయుచు గంతులు వాసుదేవుని బాడు॥ ॥దినమే॥

### రాగము - కాంభోజి - త్రిపుట తాళము

పాహి మాం శ్రీరామ యంటే పలుకవైతివి - నీ
స్నేహ మెట్టిదని చెప్ప-నోహోహోహో-హోహోహోహో

ఇబ్బంది నొంది యాకరి - బొబ్బ పెట్టినంతలోనె
గొబ్బున గాచితివని - జబ్బు సేయక
నిబ్బరముగా నే నెంతో - కబ్బమిచ్చి వేడుకొన్న
తబ్బిబ్బు చేసెదవు రామ - అబ్బబ్బబ్బబ్బబ్బబ్బ॥ ॥పాహి॥

సన్నుతించువారినెల్ల-మున్ను దయతోఁ బ్రోచితివని
పన్నగశాయి నే విని విన్నవించితిని
విన్నపము వినకయెంతో - కన్నడసేసెదవు రామ
యెన్నఁటికి నమ్మరాదు - అన్నన్నన్నన్నన్నన్న॥ ॥పాహి॥

చయ్యన భద్రాద్రినిలయ - స్వామివని నమ్మినేను
వెయ్యాఱు విధముల నుతి-చెయ్యసాగితిని
ఇయ్యెడను రామదాసుని - కుయ్యాలించి బ్రోవకున్న - నీ
యొయ్యార మేమనవచ్చు - నయ్యయ్యయ్యయ్యయ్యయ్య॥ ॥పాహి॥

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

రాగము - కాపీ ఆదితాళము

చరణములే నమ్మితి - నీదివ్య - చరణములే నమ్మితి
వారిధిగట్టిన - వరభద్రాచల - వరదా వరదా నీదివ్య॥

ఆదిశేష నన్నుఅమర సేయకు
మయ్యా అయ్యా అయ్యా నీ దివ్య॥ ॥చరణ॥

వనమున ఆతిని వనితగ జేసిన
చరణము శరణము శరణము నీ దివ్య॥ ॥చరణ॥

బాగుగ నన్నేలు - భద్రాచలరామ
దాసుఁడ దాసుఁడ దాసుఁడ నీ దివ్య॥ ॥చరణ॥

రాగము - సావేరి - చాపుతాళము

సీతారామస్వామి - నేఁ జేసిననేరము లేమీ?
ఖ్యాతిగ నీ పద-కంజయుగమునే
ప్రీతిగఁదలఁపక భేద మెంచితిన?

రంగుగ నా పదివేళ్లకు రత్నపు
టుంగరములు నిన్నడిగితినా?
సంగతి బంగరు శాలువ పాగా
లంగీల్ నడికట్లడిగితినా?
చెంగటిభూసురపుంగవు లెన్నఁగ
చెవులకు చౌకట్లడిగితివా?
ముంగరగొలుసులు ముత్యసుసరములు
అంగనలకు నిన్నడిగితినా?॥ ॥సీతా॥

ప్రేమతో నవరత్నంబులు దాఁపిన
హేమకిరీటంబడిగితినా?
కోమలమగు నీ మెడలో పుష్పపు
దామము లిమ్మని యడిగితనా?
మోమోటం బిడకుండఁగ నీదగు
మురుగులు గొలుసుల నడిగితినా?
కమలేక్షణ మిము సేవించుటకై
ఘనముగ రమ్మని పిలిచితిఁ గాని॥ ॥సీతా॥

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

తరచుగ నీ పదముల నమరిన సరి
గజ్జెల నినునే నడిగితినా
కరుణారస ముప్పొంగగ గజతుర
గము లిమ్మని నే నడిగితినా?
పరమాత్మక నీ బంగరు సేలువ
పైఁ గప్పఁగ నే నడిగితినా?
స్మరసుందర సురవర సంరక్షణ
ధన మిమ్మని నిన్నడిగితినా?॥ ॥సీతా॥

ప్రశస్తభద్రాదీశుఁడ వని నిను
ప్రభుత్వ మిమ్మని యడిగితినా?
దశరథసుత నీ చేత ధరించిన
దానకంకణం బడిగితినా?
విశదముగా నీ మేలిమి మొలనూల్
వేడుకతో నిన్నడిగితనా
ఏమను భూమిని కుంచెడు నేలకు
నెక్కువగా ని న్నడిగితినా॥ ॥సీతా॥

రాగము - ఆనందభైరవి - రూపకతాళము

పలుకే బంగార మాయెనా - కోదండపాణి
పలుకే బంగార మాయెనా?

పలుకే బంగారమాయె - పిలిచిన పలుకవేమి
కలలో నీ నామస్మరణ - మఱువఁ చక్కనితండ్రి॥ ॥పలుకే॥

ఇరువుగ నిసుకలోన - బొరలిన యుడుతభక్తికిఁ
గరుణించి ప్రోచితివని - నెఱ నమ్మితినిన్నే తండ్రి॥ ॥పలుకే॥

ఱాతి నాతిగజేసి - భూతలమునఁబ్ర
ఖ్యాతి చెందితివని - ప్రీతితో నమ్మితి తండ్రీ॥ ॥పలుకే॥

ఎంతవేఁడిన నీకు - సుంతైన దయరాదు
పంతము సేయనే - నెంతటివాడనయ్యా॥ ॥పలుకే॥

శరణాగతత్రాణ - బిరుదాంకుడవు గావా
కరుణించు భద్రాచల - వరరామదాసపోష॥ ॥పలుకే॥

## కాంభోజి - జంపె తాళము

ఇక్ష్వాకుకులతిలక యికనైనబలుకవె రామచంద్రా - నన్ను
రక్షింప కున్నావు రకులెవరయ్య రామచంద్రా॥

చుట్టు ప్రాకారములు సొంపుతో గట్టిస్తి - రామచంద్రా - ఆ
ప్రాకారానికిఁ బట్టె పదివేలవరహాలు రామచంద్రా॥ ॥ఇ॥

గోపురమంటపాల్కుదురుగ గట్టిస్తి - రామచంద్రా - నన్నుఁ
గ్రొత్తగఁజూడక యిత్తఱిఁబ్రోవుము - రామచంద్రా॥ ॥ఇ॥

భరతునకుఁజేయిస్తి పచ్చలపతకము - రామచంద్రా - ఆ
పతకానికిఁబట్టె పదివేలవరహాలు రామచంద్రా॥ ॥ఇ॥

శత్రుఘ్నునకు నేను జేయిస్తి మొలత్రాడు - రామచంద్రా - ఆ
మొలత్రాటికిఁబట్టె మొహరీలు పదివేలు రామచంద్రా॥ ॥ఇ॥

లక్ష్మణునకు జేయిస్తి ముత్యాలపతకము రామచంద్రా - ఆ
పతకానికిఁబట్టె పదివేలవరహాలు రామచంద్రా॥ ॥ఇ॥

సీతమ్మకుఁజేయిస్తి చింతకుపతకము రామచంద్రా ఆ
పతకానికిఁబట్టె పదివేల వరహాలు రామచంద్రా॥ ॥ఇ॥

కలికితురాయి నీకు పొలుపుగ జేయిస్తి రామచంద్రా - నీవు
కులుకుచు దిరిగేవు - ఎవరబ్బ సొమ్మని రామచంద్రా॥ ॥ఇ॥

మీ తండ్రి దశరథ మహారాజు పెట్టెనా రామచంద్రా - లేక
మీమామ జనకమహారాజు పంపెనా రామచంద్రా॥ ॥ఇ॥

అబ్బ తిట్టితినని యాయాసపడవద్దు రామచంద్రా - ఈ
దెబ్బలకోర్వక అబ్బ తిట్టితి నయ్య రామచంద్రా॥ ॥ఇ॥

భక్తులందఱిని బరిపాలించెడి రామచంద్రా - నీవు
క్షేమముగ శ్రీరామదాసుని నేలుము - రామచంద్రా॥ ॥ఇక్ష్వాకు॥

## రాగము - ఆసావేరి - చాపుతాళము

రామచంద్రులు నాపై - చలముచేసినారు
సీతమ్మ చెప్పవమ్మా!

కటకటా! విన డేమి సేయుదు

కఠినచిత్తునిమనసు కరఁగదు
కర్మములు నెటులుండునోకద!
ధర్మమే నీకుండు నమ్మా॥ ॥రా॥

దినదినము మీ చుట్టు దీనతతో దిరుగ
దిక్కెవ్వరింక మాకోయమ్మా
దీనపోషకు డనుచు వేఁడితి
దిక్కులన్నియుఁ బ్రకట మాయెను
ఒక్క మాటైనను వినఁడు
ఎక్కు వేమని తలతునమ్మ॥ ॥రా॥

దశరాథాత్మజుఁ డెంతో - దయశాలి యనుకొంటి
ధర్మహీనుడటే యమ్మా -
దాసజనులకు దాత యితడంట - వాసిగ భద్రగిరీశు
రామదాసుని నేలినాఁడట - రవికులాంబుధి సోమిడితడట॥ ॥రా॥

## రాగము - కళ్యాణి - ఆదితాళము

నను బ్రోవుమని చెప్పవే - సీతమ్మ తల్లీ!
ననుబ్రోవుమని చెప్పవే

నను బ్రోవుమని చెప్ప నారీశిరోమణి-
జనకునికూఁతురా! జననీ జానకమ్మ॥ ॥నను॥

ప్రక్కనుజేర్చుక - చెక్కిలి నొక్కుచుఁ
జక్కగ మరుకేళి సొక్కియుండెడి వేళ॥ ॥నను॥

అద్రిజావినుతుఁడు - భద్రగిరీశుఁడు
నిద్రమేల్కొనువేళ - నెలఁతరో బోధించి॥ ॥నను॥

## రాగము - నాదనామక్రియ - ఏకతాళము

తా. ఏ దేశమున నుండువారూ - మీరు
ఎందుండి యిట వచ్చినారూ?
రా. తొలుత గోదావరియందు - మా
స్థలము భద్రాచలమందూ

తా. ఎవరి జవానులు మీరూ - మి

మ్మెవరు పంపఁగ వచ్చినారు?
రా. దాస జవానులు మేమూ - రామ
దాసు పంపఁగ వచ్చినాము.

తా. ఏమి కులమువారు మీరూ - మీ
రిద్దరు నే వరుస వారూ?
రా. ఇనవంశమునఁ బుట్టినామూ - మే
మిద్దఱ మన్నదమ్ములము

తా. ఏమి నామము గలవారూ - మీ
రేమి నీమము గలవారు?
రా. రామోజి లక్ష్మోజి నామం - మేము
రామానుజమతమువారం

తా. ఎందుకు పంపించినారు - మీ
రేమి పనిగ వచ్చినారు?
రా. సర్కా రుబ్బాకీ పయికం - మా
చేతఁబంపఁగ వచ్చినాము.

తా. అర్థమంతయుఁ దెచ్చినారా - లేక
వ్యర్థముగా వచ్చినారా?
రా. వ్యర్థులము మేము కాము- మీ
యర్థ మంతయుఁ దెచ్చినాము.

తా. బైరోజీ బైరోజీ మీరు - మీ
బాటలు చూడఁగ వేరు
రా. బైరోవారముగాము మేము - మీ
భేటికి నిట వచ్చినాము.

తా. ధనము మాచేతికియ్యండీ - యా
వెనుక ఖైదులోకి పొండీ.
రా. ఖైదులోకి మేము పోమూ - మీ
ఖజాన పయిక మిచ్చేము

తా. చెల్లింతురా ద్రవ్యమంతా - ర
శీదుల నడుగుట వింతా!
ఉంగరంబు విడెమందూ - ను

ప్వొంగుచు దొర దట్టియందు॥
మొహరు జేసినంతలోన - జగ
న్మోహనాంగులు సంతోషమున.

రాగము - కాంభోజి - ఆటతాళము

ఏమయ్య రామ బ్ర - హ్మేంద్రాదులకునైన
నీమాయ దెలియ వశమా?
కామారివినుతగుణ - ధామ కువలయదళ
శ్యామా నను గన్నతండ్రీ రామా॥ ॥ఏమ॥

సుతుడనుచు దశరథుడు - హితుడనుచు సుగ్రీవు
డతి బలుండనుచు గవులు
క్షితినాథుడనుచు భూ - పతులు కొలిచిరిగాని
పితపావనుడనుచు - మతిదెలియ లేరయిరి॥ ॥ఏమ॥

చెలికాడనుచు బాండ - వులు విరోధివటంచు
నల జరాసంధాదులు
కలవాడవని కుచేలుడు నెఱిగిరి గాని
జలజాక్షుడని నిన్ను - సేవింపలే రయిరి॥ ॥ఏమ॥

నరుడవని నరులు తమ - దొరవనుచు యాదవులు
వరుడనుచు గోపసతులు
కరివరద భద్రాది - పురనిలయ రామదాస
పరమాత్ముడని నిన్ను - భావింపలేరైరి॥ ॥ఏమ॥

రాగము - మధ్యమావతి - ఆదితాళము

పాహి రామప్రభో - పాహి రామప్రభో
పాహి భద్రాద్రివైదేహి రామప్రభో!॥ ॥పాహి॥

శ్రీమన్మహాగుణస్తోమాభిరామ మీ
నామకీర్తనలు వర్ణింతు రామప్రభో!
సుందరాకార మన్మందిరోద్ధార సీ
తేందిరా సంయుతానంద రామప్రభో! ॥పాహి॥

ఇందిరాహృదయారవిందాధిరూఢా
ఇందిరాకార సానంద రామప్రభో!

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

ఎందునేఁ జూడ మీ సుందరానందముల్
కందునో కన్ను లింపొంద రామప్రభో! ॥పాహి॥

బృందారకాదిప - ద్బృందార్చితపదార
విందసందర్శితానంద రామప్రభో!
తల్లివీనీవె మా తండ్రివినీవె మా
దాతవునీవె మా భ్రాత రామప్రభో! ॥పాహి॥

పన్నగాధిపశయన భావనాతీత సం
పన్న నామనవి వినవన్న రామప్రభో!
ఏటివాక్యంబు మీ సాటిదైవంబు ము
మ్మాటికి భువి లేదు మేటి రామప్రభో! ॥పాహి॥

నీదు బాణంబులను నాదుశత్రుల బిట్టు
బాధింపకున్నా వదేమి రామ...!
ఆదిమధ్యాంతబహిరంతరాత్ముడ వనుచు
వాదింతు నే జగన్నాథ రామ...! ॥పాహి॥

శరణాగతత్రాణ బిరుదాంకితంబైన
వరము నా కొసఁగు మేమఱక రామప్రభో!
శ్రీరామ నీనామ చింతనామృతపాన
సారమే నాదుమది గోరు రామప్రభో! ॥పాహి॥

పాహి శ్రీరామ నీపాదపద్మాశ్రయుఁడ
పాలింపుమీ భద్రశైల రామప్రభో !
సాహి రామప్రభో పాహి రామప్రభో!
పాహిభద్రాద్రి వైదేహి రామప్రభో!

### రాగము - నాదనామక్రియ - ఆదితాళము

రామజోగిమందు కొనరే! పామరులారా
రామజోగిమందు కొనరే!

రామజోగిమందు మీరు - ప్రేమతో భుజియించినపుడే
కామక్రోధములనెల్ల కడకు పాఱద్రోలు మందు ॥ ॥రామ॥

మదమత్సరలోభములను - మాటలో నిలిపేటి మందు
గుదిగొన్న కర్మములను - గూడక యెడద్రోలు మందు ॥ ॥రామ॥

కాటుకకొండలవంటి - కర్మము లెడ(బాపు మందు
సాటిలేదు జగమునందు - స్వామి రామజోగిమందు ॥ ॥రామ॥

కోటిధనము లిత్తునని - కొన్నను దొరకని మందు
సాటిలేదు భాగవతులు - స్మరణచేసి తల(చుమందు ॥ ॥రామ॥

ముదముతో భద్రాద్రియందు - ముక్తిపొందించే మందు
సదయు(డైన రామదాసు - సద్భక్తితొ గొలిచే మందు ॥ ॥రామ॥

## రాగము - వరాళి - ఆటతాళము

అంతా రామమయం-బీ జగ
మంతా రామమయం

అంతరంగమున-నాత్మారాము(డ
నంతరూపముల-వింతలు సలుప(గ
సోమసూర్యులును-సురలు తారలును
ఆ మహాంబుధులు-నవనీజంబులు ॥ ॥అంతా॥

అండాండంబులు - పిండాండంబులు
బ్రహ్మాండంబులు-బ్రహ్మలు మొదలుగ
నదులువనంబులు-నానామృగములు
విదితకర్మములు-వేదశాస్త్రములు॥ ॥అంతా॥

అష్టదిక్కులును-నాదిశేషు(డును
అష్టవసువులను-నరిషడ్వర్గము
ధీరు(డు భద్రాచలరామదాసుని
కోరిక లోస(గెడి-తారకనామము॥ ॥అంతా॥

## మంగళహారతులు

## (1వ మంగళహారతి)

రామచంద్రాయ జనక-రాజజామనోహరాయ
మామకాభీష్టదాయ-మహితమంగళం॥ ॥రామ॥

కౌసలేయాయ మందహాసదాసపోషణాయ
వాసవాదివినుతస-ద్వరద మంగళం॥ ॥రామ॥

చారుకుంకుమోపేత-చందనానుచర్చితాయ

హారకటకశోభితాయ-భూరిమంగళం ॥ ॥రామ॥

లలితరత్నకుండలాయ-తులసీవనమాలికాయ
జలజసదృశ దేహాయ-చారుమంగళం॥ ॥రామ॥

దేవకీపుత్రాయ-దేవదేవోత్తమాయ
చావజాతగురువరాయ-భవ్యమంగళం॥ ॥రామ॥

పుండరీకాక్షాయ-పూర్ణచంద్రాననాయ
అండజాతవాహనాయ-అతులమంగళం॥ ॥రామ॥

విమలరూపాయ వివిధ-వేదాంతవేద్యాయ
సుజనచిత్తకామితాయ-సుభగమంగళం ॥ ॥రామ॥

రామదాసమృదులహృదయ తామరసనివాసాయ
స్వామి భద్రగిరివరాయ-సర్వమంగళం॥ ॥రామ॥

## (2వ మంగళహారతి)

జయమంగళం నిత్య శుభమంగళం

ధీరునకు వనధిగం-భీరునకు దుష్టసం
హారునకు ఘనమణీ-హారునకునూ
హారడిండీరనీహారహీరపటీర
తారాళి కీర్తి వి-స్తారునకునూ ॥ ॥జయమంగళం॥

మంగళము రామునకు-మహితగుణధామునకు
మంగళము క్షీరాబ్ధి-మందిరునకూ
మంగళము మునిబృంద-మానస నివాసునకును
మంగళము సర్వగుణ-మందిరునకూ ॥ ॥జయమంగళం॥

ఆద్యునకు బ్రహ్మాది-వేద్యునకు దుర్మనో
భేద్యునకు భవరుజా-వైద్యునకునూ
సద్యఃఫలప్రదున-కాద్యంతరహితునకు
విద్యావివేకజన-హృద్యునకునూ ॥ ॥జయమంగళం॥

జైత్రునకు సౌమిత్రి-మిత్రునకు భక్తివన
చైత్రులకు నవపద్మ నేత్రునకునూ
మిత్రవంశాబ్ధ-సన్మిత్రునకుసుర వినుత

పాత్రునకు జగదవన-సూత్రునకునూ ॥        ॥జయమంగళం॥